
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 23 జూలై 2025 | 5



అమ్మవార్లకు సారె

కాట్రేనికోట మండలం ఉప్పూడి గంగాదేవర మల్లమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం ఆఖరి మంగళవారం గ్రామ ఆడపడుచులు అమ్మవారి ఆలయానికి సారె, చీరలతో సమర్పించారు. అలాగే ముమ్మిడివరం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారికి, వనువులమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, పండ్లు, చలివిడి పానకాలు, వడపప్పు, పట్టువస్త్రాలు, నిమ్మకాయల దండలు, స్వీట్లతో శోభాయాత్రగా అమ్మవారి నామజపం చేస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇక శ్రావణానందమే!

- 26 నుంచి శ్రావణమాసం
- మోగనున్న పెళ్లి బాజాలు



అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం వచ్చిందంటే ఆ సందడే వేరు.. ప్రతి ఇంటా పండగే.. ప్రతి ఇంటా లక్ష్మీ సందడే.. రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలు ఆచరించడం ఆనవాయితీ.. అంటే కాకుండా ఈ మాసం అంతా శుభప్రదంగా ఉంటుందనేది భక్తుల నమ్మకం. ఏ కార్యక్రమైనా ఈ మాసంలోనే తలపెడుతుంటారు. సుమారు 40 రోజుల తరువాత ఈ నెల 26 నుంచి శుభ ముహూర్తాలు జోరందుకోనున్నాయి. మూఢం, ఆషాఢం ఒకేసారి రావడంతో జూన్ 6 తరువాత ఒక్కసారిగా ఆగిపోయిన శుభకార్యక్రమాలు తిరిగి శ్రావణం రాకతో ఊపందుకుంటాయి. ఈనెల 25 నుంచి శ్రావణమాసం ప్రారంభమవుండగా ఆగస్టు 17 వరకు వివాహం, గృహప్రవేశం వంటి శుభముహూర్తాలను పండితులు, పంచాగకర్తలు నిర్ణయించారు. శ్రావణమాసానికి సంబంధించి జూలై 30,31, ఆగస్టు 3,5,7,8,9,10,11,12,13,14,17 తేదీల్లో వివాహాది శుభ ముహూర్తాలను నిర్ణయించారు. వీటిలో జూలై 31, ఆగస్టు 8,9,10,13,14 తేదీల్లో అత్యంత బలమైన ముహూర్తాలుగా పండితులు తెలిపారు. శ్రావణ మాసం శుభముహూర్తాలతో కార్యక్రమాలు నిర్వహించే పురోహితులు, సన్నాయిమేళం, కల్యాణ మండపాలకు గిరాకీ ఏర్పడింది. క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్లకు డిమాండ్ నెలకొంది. శ్రావణమాసంలో ఒక్క అన్నవరం దేవస్థానంలో సుమారు 600 వివాహాలు జరగవచ్చని అంచనా. ఆగస్టు 17 దాటితే భాద్రపదమాసం శూన్య మాసం కావడంతో నెలరోజులు శుభకార్యాలకు అవకాశం లేదు. మళ్లీ సెప్టెంబ రు 24 నుంచి నవంబరు 30 వరకు ముహూర్తాలున్నాయి.

శ్రావణం..శుభమస్తు 6



ఉప్పూడి మల్లమ్మతల్లికి సారె సమర్పించిన ఆడపడుచులు



సత్తెమ్మతల్లి అమ్మవారికి సమర్పించిన సారె

అనంతపాపం.. బద్దలు!



వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కార్ సీట్‌లో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మృతదేహం (ఫైల్)

మళ్లీ వీధికెక్కిన హత్యకేసు

- డ్రైవర్ హత్య కేసులో కీలక మలుపు
- తదుపరి విచారణకు అనుమతి
- ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం తీర్పు
- జగన్ ప్రభుత్వం అనంత ప్రేమ
- పైపై ఆధారాలతో ఛార్జిషీట్
- న్యాయవాది ముప్పాళ్ల పోరాటం
- న్యాయం చేస్తామని లోకేశ్ హామీ
- ఎట్టకేలకు రంగంలోకి పోలీస్
- బెయిల్‌పై ఉన్న అనంతబాబు

(కాకినాడ/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు పూర్తిగా పక్కన పడిపోయిన కేసును తదుపరి మరింత లోతుగా విచారణ జరిగేలా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయ స్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసులు దాఖలు చేసిన తొలి చార్జిషీటులో అనేక కీలక వాస్తవాలు విస్మరించిన నేపథ్యంలో బాధితుల విజ్ఞప్తి, ప్రాసిక్యూషన్ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసుపై 90 రోజుల్లోగా సప్లమెంటరీ చార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది. తాజా కోర్టు ఆదేశాలతో కేసు మరింత దర్యాప్తునకు మార్గం సుగమమైంది.

కారులో తీసుకెళ్లి.. డెడ్ బాడీ తెచ్చి..

ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లి హత్య చేశాడు. మే 19 తెల్లవారు జామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకొచ్చాడు. పలు పరిణామాల నేపథ్యంలో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. గత వైసీపీ ప్రభుత్వం తన సొంత పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబుపై అవాజ్యమైన ప్రేమ కురిపించింది. అనంతబాబును కాపాడేందుకు కేసును నీరుగార్చేసింది. పైపై ఆధారాలతో న్యాయ స్థానంలో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో అనంతబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో కొద్దిరోజులు శిక్ష అనుభవించి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు.

ఇక అన్నీ తేల్చేస్తారు..

ఈ కేసుపై రాజమహేంద్రవరంలో సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు 2018లో తీవ్ర పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా కృషి చేశారు. అనంతబాబుపై గతంలో రౌడీషీట్ లేదని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొనడంపైనా పిటిషన్ దాఖలు చేశారు. రౌడీషీట్ ఉందని నిరూపించారు. న్యాయం కోసం బాధితులను వెంటబెట్టుకుని హైకోర్టు వరకు వెళ్లారు. అయితే వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో కేసు నీరుగారిపోయింది. గతేడాది ప్రభుత్వం మారాక కేసు విచారణ మలుపు తిరిగింది. ఎన్నికల సమయంలో బాధితులు నారా లోకేశ్‌ను యు.కొత్తపల్లి సభలో కలిసి తమకు న్యాయం చేయాలని కోరగా అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం మారాక ఈ ఏడాది మార్చి నుంచి కేసులో వేగం పెరిగింది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్లను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు వీలుగా ఏప్రిల్ 17న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు కేసు తదుపరి విచారణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రాసిక్యూషన్ రాజమహేంద్రవరం అట్రాసిటీ న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. హత్య అనంతరం జరిగిన దర్యాప్తులో అనేక కీలక అంశాలను విస్మరించిన నేపథ్యంలో లోతుగా కేసును విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొంది.తదుపరి విచారణకు అనుమతి మంజూరు చేయాలని కోరింది. మరోపక్క మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్న విషయంపై ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేసిన అంశాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. ఈ కేసును తదుపరి విచారించేందుకు వీలుగా పాటిల్ దేవరాజ్ మనిష్ అనే ఐపీఎస్ అధికారిని కాకినాడ జిల్లా ఎస్పీ నియమించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రాసిక్యూషన్ ప్రస్తావించింది. హత్య కేసులో మరికొందరు సాక్షులను విచారించాల్సి ఉండడం, మరిన్ని సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో తదుపరి విచారణకు అనుమతి కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం కేసు

కేసుపై మళ్లీ విచారణ

లోతైన విచారణ చేయడంతోపాటు 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని కోర్టులో దాఖలైన పిటిషన్‌పై రాజమహేంద్రవరం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కార న్యాయస్థానం న్యాయమూర్తి సింగవరపు ఉమా సునంద మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో అనంతబాబు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అనంతబాబుపై తిరిగి పూర్తి విచారణ జరగనుంది. న్యాయసలహాదారుగా న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు.. పీపీలు కె.రాధా కృష్ణ, డి.శ్రీవాణి వాదించారు.

తదుపరి విచారణకు అనుమతివ్వడంతో మరింత లోతుగావిచారణ జరగనుంది.

తల్లి ఫిర్యాదు.. సిట్ టీమ్

తన కుమారుడి హత్య కేసులో తనకు అనుమానాలున్నాయని ఇప్పటికే డీజీపీకి మృతుడి తల్లి నూకరత్నం ఫిర్యాదు చేశారు. దీంతో డీజీపీ కార్యాలయం నుంచి కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌కి వెంటనే యాక్షన్ తీసుకోవాలని ఆదేశాలు అందాయి. విచారణకు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడంతోపాటు 60 రోజుల్లో నివేదిక ఇచ్చి తదుపరి యాక్షన్‌కు కోర్టును అనుమతి కోరాలని ఆదేశించారు. ఈ ఏడాది కేసు విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను నియమిస్తూ కాకినాడ ఏఎస్పీ పి.దేవరాజ్ మనీష్ మెమో జారీచేశారు. ఆ టీమ్‌లో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఎస్ఐలు బి.వినయ్‌ప్రతాప్, పి.శ్రీనివాస్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.రామకృష్ణ, కానిస్టేబుల్ ఎం.సతీష్ ఉన్నారు.

ఎవరూ తప్పించుకోలేరు..



దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో ఎవరూ తప్పించుకోలేరు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతనికి సహకరించిన వారికి శిక్ష పడుతుంది. ఇప్పటికే ప్రభుత్వం సిట్‌ను నియమించింది.. సిట్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి 90 రోజుల్లో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అనంతబాబును కాపాడడానికి శక్తివంచన లేకుండా పనిచేసింది. కానీ ప్రజా పోరాటాల వల్ల కేసు మళ్లీ తెరమీదకు వచ్చింది. ఆనాటి కాకినాడ ఎస్పీ, ఇతర అధికారులు అనేక తప్పిదాలు చేశారు.ఈ కేసులో ఎవరెవరు ఏ పాత్ర పోషించారో తేల్చే అవకాశాలు ఉన్నాయి.

- ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది

ఫ్లైఓవర్ ఇంతేనా!



పిల్లర్ల దశలోనే నిలిచిన జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

- జొన్నాడ ఫ్లైఓవర్ పనుల్లో ప్రగతి శూన్యం
- ఏళ్ల తరబడి మొండి గోడలుగానే మిగిలిన పిల్లర్లు
- సర్వీసు రోడ్లలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు.. ప్రజలకు ఇక్కట్లు
- అప్రోచ్ రోడ్డు పనులూ ముందుకు సాగని తీరు
- ఎంపీ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకున్నా స్పందన శూన్యం



జొన్నాడ వద్ద అప్రోచ్ రోడ్డులో ట్రాఫిక్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిపై నిర్మిస్తున్న జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ ప్రగతి అతీగతీ లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి ఇచ్చిన హామీ ఆచరణ సాధ్యం కాని పరిస్థితి. ఈ జొన్నాడ ఫ్లైఓవర్ ప్రగతిపై సాక్షాత్తూ నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌బాలయోగిసహా పలు శాఖల అధికారులు దృష్టి సారించినప్పటికీ పనుల్లో ఆశించిన పురోగతి లేదు. జూలై నెలాఖరు నాటికి గడ్డర్ల నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశగా పనులు సాగడం లేదు. అప్రోచ్ రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి అయిన 216ఏలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అదే కీలకమైన జంక్షన్‌గా పేరొందిన జొన్నాడలో ట్రాఫిక్ రద్దీ నివారించే లక్ష్యంతో గత కొన్ని సంవత్సరాల క్రితం ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టారు. రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ఈ వంతెన పనులు అసంపూర్తిగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అటూ ఇటూ ఏర్పాటుచేసిన సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా మారి జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధంగా మారింది. ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంది. అయినప్పటికీ కాంట్రాక్టు సంస్థ అధికారులు ఈ పనులు పూర్తి చేయడంలో అంతులేని నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వాస్తవానికి ఈ ఏడాది డిసెంబరు నెలాఖరులోగా ఈ వంతెన పనులు పూర్తిచేసి అప్పగిస్తామని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఇటీవల నిర్మించిన సమీక్షలో హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశగా పనులేవీ ముందుకు సాగడం లేదు. జూలై నెలాఖరుకే గడ్డర్లువేస్తామని చెప్పినప్పటికీ అవి ముందుకు వెళ్లడం లేదు. ఇటీవల అమలాపురం వచ్చిన జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఎంపీ గంటి హరీష్‌బాలయోగి సమావేశమయ్యారు. జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధుల తీరుపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ అంశంపై జాతీయ ఉపరిత రవాణాశాఖ మంత్రి నితీష్‌గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లి పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎంపీ హరీష్‌బాలయోగి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కాగా ఒకవైపు వారధి నిర్మాణం, మరోవైపు అప్రోచ్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని అంతా భావించారు. అయితే ప్రస్తుతం అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఓ కాంట్రాక్టు సంస్థకు మట్టి తోలేందుకు అనుమతులు ఇచ్చామని జిల్లా అధికారులు ప్రకటించినప్పటికీ అక్కడ ఒక ట్రక్కు మట్టివేసి అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. దాంతో ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులన్నీ మూలనపడ్డాయి. చివరకు స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు సైతం జొన్నాడ ఫ్లైవంతెన ప్రగతి కోసం పట్టించుకోకపోతే ఎలా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

పాడి పరిశ్రమల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,జూలై22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి, పశువుల సంతతి మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో పశు సంవర్ధకశాఖ అధికారులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పశువుల సంఖ్యను పెంచాల్సిన సాధ్యాసాధ్యాలపై అధికారులు అనుభవ పూర్వకమైన సూచనలు కోరారు. పశువుల పోషకాహార స్థితిగతులను మెరుగుపరుస్తూ పాలదిగుబడిని పెంచాలని సూచించారు. అందుకు అవసరమైన పశువుల దాణా పైలెట్ ప్రాజెక్టులను రావులపాలెం, రామచంద్రపురంలో డ్వాక్రా సంఘాల సమన్వయంతో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కృష్ణా జిల్లా వీరవల్లి గ్రామంలో పశువుల దాణా యూనిట్‌ను ఇటీవల వైద్యాధికారుల బృందం సందర్శించిందని, దీనికి సంబంధించిన పూర్తి ప్రాజెక్టు నివేదికను అందించాలని ఆదేశించారు. బేసిక్ మిషనరీ, ముడి సరుకు లభ్యత, తక్కువ ధరకే రవాణా అందుబాటులో ఉండాలని, జిల్లాలో పశువుల సంఖ్య, క్రయవిక్రయాల డిమాండ్లపై అధ్యయనం చేస్తూ ఈ యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. జొన్నలు, వేరుశనగ, నువ్వుల కేక్‌లు, సప్లిమెంట్ వరి ఉత్పత్తుల వంటి అంశాలతో కూడిన నివేదికలను రూపొందించాలని కోరారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి పరిశ్రమకు ఉపయోగకరంగా ఉండే 'సునందిని' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలన్నారు. రాయితీపై రైతు సేవా కేంద్రాల ద్వారా పశువులకు అవసరమైన దాణా అందిస్తే పాడిపరిశ్రమ అభివృద్ధి చెందు తుందన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, సహాయ సంచాలకుడు ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా పీఎం సూర్యఘర్ పథకం

జిల్లాలో 10వేల ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారికి ఆగస్టు నెలాఖరుకు ఉచితంగా పీఎం సూర్యఘర్ పథకం యూనిట్లను నెలకొల్పాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ లక్ష్యంగా నిర్దేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం అమలుకోసం సర్వే నిర్వహించిన తీరు, రిజిస్ట్రేషన్ అంశాలపై సమీక్షించారు. వినియోగదారుడే ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం ఈ పథకంలో ఉందన్నారు. రెండు కిలో వాట్ల వరకు ఎస్సీ ఎస్టీల వారికి ఉచితంగా యూనిట్లు స్థాపిస్తామని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఎస్సీ, ఎస్టీ కుటుంబాల రిజిస్ట్రేషన్, రూఫ్ టాప్ విజిబులిటీ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రతిపాదించిన ఏజన్సీల ద్వారా యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలో వీధిలైట్లు, కార్యాలయాల తాగునీటి శుద్ధి ప్లాంట్లు, పంపింగ్ మోటార్లకు, షాపింగ్ కాంప్లెక్సులకు అవసరమైన విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని సూచించారు. కౌన్సిల్‌లో తీర్మానాలు ఆమోదించి బ్యాంకర్ల సమన్వయంతో ఆయా ప్రాంతాల్లో యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 70వేల వరకు ఉన్నాయని, వీటిలో 50 వేల మందికి రూఫ్‌టాప్‌లు ఉన్నాయని, మిగిలినవారికి బహిరంగ ప్రదేశాలు ఎంపికచేసి యూనిట్లు నెలకొల్పాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ బి.రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్లు నిర్మల్‌కుమార్, రాజు, డీఈలు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో కోకో మొక్కల పెంపకానికి నరేగా అనుసంధానం


జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో ఉన్న వెయ్యి ఎకరాల్లో కోకో సాగు విస్తీర్ణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ఉద్యానశాఖ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు, జిల్లా పరిశ్రమల కేంద్రం లీడ్ బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో కోకో సాగు చర్యలపై సమీక్షించారు. కొబ్బరిలో అంతర పంటగా సుమారు 200 మొక్కలు నాటాలని సూచించారు. మొక్క ఖరీదు రూ.7, రవాణా చార్జీ రూ.7.63గా నిర్ధారించారు. రవాణాచార్జీ, మొక్క ఖరీదుకు సంబంధించి నరేగా ద్వారా నిధులు చెల్లించాలని ఆదేశించారు. మొదటి సంవత్సరం మొక్కల సంరక్షణకు నీటి సదుపాయం, ఎరువుల వినియోగానికి రూ.56వేలు, రెండో ఏడాది రూ.47,720, మూడో ఏడాది రూ.46,203ను నరేగా ద్వారా నిధులు రైతులకు అందుతాయన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ పి.మాధవీలత సహకారంతో కోకో పర్మింటేషన్ కేంద్రం ఏర్పాటుకు జిల్లా పరిశ్రమల కేంద్రం డీపీఆర్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ టి.నిషాంతి, ఉద్యానవన అధికారులు రమణ, దిలీప్, డ్వామా పీడీ మధుసూదన్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ త్రినాథ్, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

అమలాపురంలో విపత్తుల స్పందన దళం : ఆర్డీవో

అమలాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలు వంటి విపత్కర సమయాల్లో పశువుల వంటివి ప్రమాదాల బారిన పడినా వాటిపై తక్షణమే స్పందించి కాపాడుకునేందుకు సెర్చ్ ఆపరేషన్లు కొనసాగించాలని ఆర్డీవో కె.మాధవి సూచించారు. వరదల సమయంలో ఉత్పన్నమయ్యే ఆస్తి, ప్రాణ నష్టాల నివారణ కోసం విపత్తుల స్పందన దళానికి స్థానిక సబ్‌జైలు ప్రాంగణంలో తాత్కాలిక నివాసం ఏర్పాటుచేసినట్టు ఆర్డీవో ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు రుతుపవనాల ఆగమనం, గోదావరి వరదలు వంటి ప్రకృతి విపత్తుల పట్ల తక్షణం స్పందించి ఎదుర్కొనేందుకు వీలుగా ఈ దళాన్ని సిద్ధం చేయడం జరిగిందన్నారు. 40 మంది సభ్యులతో రాష్ట్ర విపత్తుల స్పందన దళం రావాల్సి ఉండగా, ప్రస్తుతం 27 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

రోగ నిర్ధారణ కాకుండా మందులు వాడించడంపై డీసీహెచ్ విచారణ

ప్రాణపాయ స్థితికి వెళ్లిన బాధితురాలు



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి

కొత్తపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ కాకుండా ఓ మహిళకు మందులు ఇచ్చి వాడించడంపై ఒక మహిళ తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరడంతో బాధిత కుటుంబం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో మంగళవారం అవిడి పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కార్తీక్‌రెడ్డి విచారణ చేపట్టారు. కొత్తపేటకు చెందిన బులుసువల్లీ పద్మశ్రీకి కొంతకాలం కిందట కాలు శీలమండ పైభాగాన మచ్చరావడంతో వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులను సంప్రదించింది. గత ఏప్రిల్ 15న కుష్టువ్యాధి నిర్ధారణపై క్యాంపు ఉందని, అప్పుడు తీసుకురావాలని చెప్పడంతో ఆరోజు వానపల్లి పీహెచ్‌సీకి తీసుకుని వెళ్లారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి భరతలక్ష్మి నేతృత్వంలో జరిగిన క్యాంపులో డీపీఎంవో మాధవరపు వెంకటేశ్వర్లు పద్మశ్రీని పరీక్షించి మచ్చ స్పర్శ లేదని గుర్తించారు. ఇద్దరి పర్యవేక్షణలో నిర్ధారణ పరీక్షలు చేయకుండా లెప్రసీగా నిర్ధారించి మందులు ఒక నెల వాడాలని ఇచ్చారు. అయితే ఆ మందులు పది రోజులు వాడేసరికి పద్మశ్రీకి తలనొప్పి, వికారం రావడంతో మళ్లీ వారిని ఫోన్‌లో సంప్రదిస్తే కొబ్బరినీళ్లు, మంచినీరు ఎక్కువ తాగాలని సూచించారు. పరిస్థితి విషమించి ప్రైవేట్ వైద్యులకు చూపించారు. అయినా కోలుకోకపోవడంతో అమలాపురం కిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు లెప్రసీ నిర్ధారణ చేయకుండా మందులు ఇవ్వడంతో రియాక్షన్ వచ్చిందని గుర్తించి వైద్యం అందించారు. జూన్ 2న వారు పద్మశ్రీని వైద్యం చేసి ఆరు నెలల పాటు శరీరంలో ఎలర్జీ ఉంటుందని మందులు వాడాలని సూచించారు.

విచారణ తర్వాత చర్యలు: డీసీహెచ్

బాధితురాలు భర్త వీర వెంకట సత్య సుబ్బారావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీసీహెచ్ మంగళవారం అవిడి పీహెచ్‌సీలో బాధితుల నుంచి వివరాలు స్వయంగా తెలుసుకున్నారు. దీనిపై డాక్టర్ కార్తీక్‌రెడ్డిని వివరణ కోరగా వైద్యం అందించిన ప్రైవేట్ వైద్యుల నుంచి కూడా వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రావణం.. శుభమస్తు!



(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

కల్యాణ శోభను సంతరించుకుని మరో రెండు రోజుల్లో మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడనుంది. ఆషాఢమాసం నిరాశను మిగల్చగా శ్రావణ మాసంకోసం మార్కెట్‌లో అన్నివర్గాల ప్రధాన వ్యాపారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శ్రావణమాసం నుంచి వివాహాది శుభ ముహూర్తాలు మెండు ఉండడంతోపాటు వరుసగా పండుగలు, నోములు, వ్రతాలు ఉన్నాయి. కొత్తగా పెళ్లి అయిన దంపతులు ఆషాఢమాసం కారణంగా నెల రోజుల పాటు దూరంగా ఉన్నారు. వారంతా శ్రావణమాసం కోసం ఎదురుచూస్తున్నారు. పుట్టింట ఉన్న భార్యను మెట్టినింటికి తీసుకువెళ్లేందుకు వారి వ్యక్తిగత నామ నక్షత్రాలను బట్టి సిద్ధాంతులు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. కొందరికి ముందుగా ముహూర్తం కుదిరితే మరికొందరికి ఇంకొంత ఆలస్యమవుతుంది. గత రెండు నెలలుగా పెళ్లిళ్లు లేవు. పండుగలు, ఇతర శుభ కార్యక్రమాలు అంతంత మాత్రమే. వస్త్ర వ్యాపారం, బంగారం కొనుగోళ్లు ఇలా ఎన్నో వ్యాపారాలు డీలా పడిపోయాయి. ఆషాఢమాసం అలా ముగుస్తుందో లేదో ఒక్కసారిగా మార్కెట్‌లో కొత్త శోభ సంతరించుకుంటుంది. ఆషాఢం వెళ్తావెళ్తూ శ్రావణ శోభను తీసుకువస్తుంది. శ్రావణమాసపు అమ్మకాలు ఏ స్థాయిలో ఉంటాయో అంచనాలు వేసుకుని ఇప్పటికే కొనుగోళ్లు జరిపి వస్త్ర వ్యాపారులతో అన్ని వ్యాపార సంస్థలు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. శ్రావణం అంటేనే పండుగలు. దానికితోడు వివాహాది శుభకార్యాలు మెండుగా ఉండడంతో మార్కెట్ ఊపందుకోనుంది.

- ప్రారంభం కానున్న శ్రావణ శోభ
- 25నశుక్రవారం శ్రావణ మాసం ప్రారంభం
- మెండుగా వివాహాది ముహూర్తాలు.. నిండుగా పండుగలు

శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం 'శ్రవణ'

అమావాస్యతో ఆషాఢమాసం ముగిసి శుక్రవారం నుంచి శ్రావణ సందడి మొదలవుతోంది. ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాసం. ఈ శ్రావణమంతా నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతీ ఇంటా సందడే. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ. ఆ పేరు మీద వచ్చిన శ్రావణమాసం కావడంతో శ్రీలక్ష్మీ దేవికి ఎంతో ఇష్టం. శ్రావణ సోమవారం వ్రతాన్ని పరమశివుని ప్రీత్యర్థం జరుపుకుని భక్తులు ఉపవాసాలుంటారు. ఇక ప్రతీ మంగళవారం కొత్తగా వివాహమైన స్త్రీలు మంగళగౌరీ వ్రతాలు జరుపుకుంటారు. తిథి, నక్షత్రాలను బట్టి సూపోదన వ్రతం, అవ్యంగ సప్తమీ వ్రతం, పుష్పాష్టమి వ్రతం, అనంగ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇక ఆగస్టు 8న ప్రతి ఇంటా వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు. ఆరోజున వీలుపడని వారు జూలై 25, ఆగస్టు 1, 15, 22 తేదీల్లోను వరలక్ష్మీవ్రతాలు చేసుకుంటారు. ఈ ఏడాది ఐదు శ్రావణ శుక్రవారాలు రావడం విశేషం. ఈ నెల 27న స్వర్ణగౌరీ వ్రతం, 28న నాగచతుర్థి, 29న మంగళగౌరీ వ్రతం, నాగపంచమి, గరుడపంచమి జరుపుకుంటారు. 30న సూర్యషష్ఠి, ఆగస్టున 7న వరాహ జయంతి, 8న వరలక్ష్మీ వ్రతం, 9న వచ్చే పౌర్ణమి.. రాఖీ పౌర్ణమి. ఇక జంధ్యాల పౌర్ణమి కూడా కావడంతో జీర్ణమయ యజ్ఞోపవీతాలను విసర్జించి కొత్తవాటిని ధరిస్తారు. 15న వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమిని అయితే పాఠశాల విద్యార్థులు వారం రోజుల ముందు నుంచే జరుపుకుంటారు. 16న వైష్ణవ శ్రీకృష్ణ జయంతి, 22న పోలాంబ వ్రతం జరుపుకుంటారు. **- కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, బండారులంక**

పండుగలే పండుగలు.. జూలై 29న నాగపంచమి.. ఆగస్టు 8న వరలక్ష్మీవత్రం



అంబాజీపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రావణం రాకతో ఊరువాడా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. అమ్మవారి ఆలయాలన్నీ కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. మనసుకు ప్రశాంతత కల్పించే ఈ మాసంలో మహిళలు సకల సౌభాగ్యాలతోపాటు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కటాక్షం పొందేందుకు వ్రతాలు, ఉపవాసాలు, ఆరాధనలు ప్రారంభించనున్నారు. మహిళలంతా భక్తిప్రపత్తులతో కుంకుమ పూజలు ఆచరిస్తున్నారు. పున్నమి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసంలో ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క విశిష్టత ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారల్లోనూ శ్రావణలక్ష్మి పూజలు చేస్తారు. ఈ ఏడాది శ్రావణమాసం జూలై 25 నుంచి ప్రారంభమం కానుంది. వివాహితులు ఈనెలలో నోములు, వ్రతాలతో గడుపుతారు. వరలక్ష్మి వ్రతం రోజున అమ్మవార్కి కలశం పెట్టి నిండుగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఇలా చేస్తే ఆయురోగ్యాలతోపాటు సౌభాగ్యం లభిస్తుందని విశ్వాసం. ఈనెలలో ప్రధానంగా 29వ తేదీన నాగుల పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 12న సంకష్ట హర చతుర్థి, 16న శ్రీకృష్ణాష్టమి, 19న అజ ఏకాదశి, ఆగస్టు 23న పోలాల అమావాస్య, శ్రావణమాసం ముగింపు, ఆగస్టు 27న వినాయక చవితి పండుగలు జరగనున్నాయి. తమ భర్తలు, కుమారులు పంటపొలాల్లో సంచరించే సమయంలో ఎలాంటి హానీ తలపెట్టొందని నాగేంద్రుడుని మహిళలు పూజించే పండుగే నాగుల పంచమి. సోదర క్షేమాన్ని తమకు రక్షణ భాగ్యాన్ని కల్పించమని కోరుతూ నిర్వహించేదే రాఖీ పౌర్ణమి వేడుక. అలాగే యజ్ఞోపవీతాన్ని ధరించేందుకు జంధ్యాల పౌర్ణమి, గ్రామదేవతలను కొలిచేందుకు చేసుకునే పోలాల అమవాస్య పండుగ తదితర పర్వదినాలు ఈ మాసంలో వస్తాయి. అలాగే శ్రావణ మాసంలో వచ్చే నాలుగు మంగళవారాలకు మహిళలు మంగళగౌరిని పూజిస్తారు. పార్వతిదేవికి మరో పేరే మంగళగౌరి. కొత్తగా వివాహమైన వధువులు ఈ వ్రతం ఆచరిస్తే సౌభాగ్యం. ఐదోతనం కలకాలం సిద్ధిస్తుందని విశ్వాసం. మరో ముఖ్యమైన శ్రీ వరలక్ష్మి వ్రతం ఆచరిస్తే అష్టలక్ష్మిలను కొలిచినట్టే. పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం ఆచరించడానికి మహిళలు ఎదురు చూస్తున్నారు. ఇక శ్రావణ మాసం సందర్భంగా పలు అమ్మవారి ఆలయాలతోపాటు ప్రముఖ ఆలయాలు ముస్తాబుకానున్నాయి. అనునిత్యం వ్రతాలు, హోమాలు నిర్వహిస్తారు.

అపురూపం అనుగ్రహం

ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను మంగళవారం వివిధ రూపాల్లో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అమ్మవార్ల అనుగ్రహం పొందారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లిని పసుపుకొమ్ములు, నెమలి పింఛాలతో అలంకరించిన దృశ్యం

ఐటీఐల్లో ప్రవేశానికి నేడు, రేపు రెండో విడత కౌన్సెలింగ్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2025-26 సంవత్సరానికి గాను రెండో విడత ప్రవేశానికి 1035 అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. వారికి మెరిట్ లిస్టు ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 23, 24 తేదీల్లో జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్‌వర్మ తెలిపారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు 9.7 నుంచి 6.2 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 6.1 నుంచి 5.2 జీపీఏ గ్రేడ్ వరకు, 24వ తేదీ ఉదయం 8 గంటలకు 5.1 నుంచి 4.3 జీపీఏ గ్రేడ్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 4.2 నుంచి 2.0 జీపీఏ గ్రేడ్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది. అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

కాలుష్యకారక పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి

ఉమ్మడి జిల్లా మహాసభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క పిఠాపురంలో కార్మికుల భారీ ప్రదర్శన



పిఠాపురంలో జరిగిన ఏఐటీయూసీ మహాసభలో మాట్లాడుతున్న విమలక్క

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారుల పొట్టగొడుతున్న కాలుష్యకారక పరిశ్రమల అనుమతులను రద్దు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ కాకినాడ జిల్లాలోని పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో మంగళవారం జరిగింది. తీర ప్రాంతంలో ఉన్న ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యకారక వ్యర్థాలను సముద్రంలోకి వదిలివేస్తుండటంతో మత్స్యసంపద చనిపోతోందన్నారు. హేచరీలు దెబ్బతింటున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన వక్త, ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్‌మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. కార్మిక చట్టాల అమలుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పిఠాపురం వీధుల్లో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉపాధి కూలీల వేతనాన్ని రూ.600కి పెంచాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గొల్ల అంజయ్య, అరుణోదయ సమాఖ్య ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు ఏపూరి సుధాకర్, మల్సూర్ ఖదీర్, ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, బి.రమేష్, డొక్కులూరి సంగీత, కె.బోజీ, డి.నారాయణమూర్తి, మడికి సత్యం, గుడాల చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు డీసీసీబీ చైర్మన్ పూజలు



పెద్దాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) సతీసమేతంగా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మరిడమ్మ దేవస్థానంలో నిత్యాన్నదానానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మరిడమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు మంగళవారం ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి అన్న ప్రసాదం వడ్డించారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ నేత రాజా సూరిబాబురాజు, జనసేన నాయకుడు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నలకు కేంద్ర మంత్రుల సమాధానం

కాకినాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ శక్తి, మారిటైం నైపుణ్య రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ, శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్, కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన రెండు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. సోలార్ విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందని వివరించారు. మొత్తం 1,454.86 మెగా వాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సామర్థ్యం రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. కేంద్ర పథకాల ద్వారా 3,300 మెగావాట్లతో పార్కుల అభివృద్ధి, 38వేల కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్, లక్ష వ్యవసాయ పంపులు పీఎం కిసాన్ కింద కేటాయింపు, 400 మెగావాట్ల ఈపీసీ ఒప్పందాలు జరిగాయని తెలిపారు. మారిటైం నైపుణ్యాభివృద్ధి-విశాఖ సీఈఎంఎస్ కేంద్రం దేశంలోనే అత్యుత్తమంగా ఉందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ కేంద్రాలు దేశంలో రెండు ఉన్నాయని.... వీటిలో విశాఖలో 22, ముంబయిలో 6 ల్యాబ్స్ ఉన్నాయని వెల్లడించారు. కాకినాడ వంటి తీర ప్రాంతాల్లో కూడా ఇలాంటి ప్రాజెక్టులకు కేంద్రం ప్రాధాన్యమిచ్చేలా ఎంఎన్ఆర్ఈ, ఎస్ఈసీఐ సంస్థలతో చర్చలు కొనసాగిస్తానని ఎంపీ చెప్పారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు



సూక్ష్మపోషకాలు వేసిన పొలంలో వరి పంట.. సూక్ష్మపోషకాలు అవసరత ఉన్న చౌడు బారిన పొలం

సూక్ష్మ పోషకాలతో అన్నీ లాభాలే!

- పంట ఎదుగుదలలో కీలక పాత్ర
- చౌడు నివారణకు దోహదం
- దిగుబడులు పెరిగే అవకాశం
- నూరు శాతం సబ్సిడీపై అందిస్తే రైతుకు దన్ను
- గతంలో ఇదే విధంగా పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం

భూసార పరిరక్షణ, పంటలు పుష్కలంగా పండాలంటే సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండాలి. ఇవి సమతుల్యంగా లేకుండా ఉంటే భూమి చౌడు బారుతుంది. దిగుబడులు తగ్గిపోతాయి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సూక్ష్మపోషకాలను వినియోగిస్తే రైతులకు అన్నీ లాభాలే. వీటిని నూరుశాతం సబ్సిడీపై అందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే రీతిలో ఇచ్చిన విషయాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.



2019 వరకు టీడీపీ ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీపై అందించిన జింక్ సల్ఫేట్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పంట ఆరోగ్యంగా ఎదిగి సమృద్ధిగా పండడడానికి, దిగుబడులు ఆశాజనంగా లభించడంలో సూక్ష్మ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయి. సూక్ష్మ పోషకాలు(మైక్రోన్యూట్రియంట్స్) అయిన జింక్, ఐరన్, మాంగనీస్, రాగి, బోరాన్, గంధకం వంటివి సమతుల్యంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. పంట భూముల్లో సూక్ష్మపోషకాలు సరిపడా లేకున్నా నిర్దేశించిన ప్రమాణాల్లో అవి లేకున్నా పంట భూములు చౌడుగా మారతాయి. సూక్ష్మధాతు లోపం ఉన్నట్టు గుర్తించిన పొలాల్లో వీటిని వేయడం ద్వారా పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు. క్రమం తప్పకుండా వినియోగిస్తే చౌడుబారిన భూములను సారవంతంగా మారుస్తాయి. భూసార పరీక్షల ద్వారా వీటి లోపాలను గుర్తించి ముందుగానే వినియోగిస్తే దిగుబడులు ఆశాజనకంగా లభిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న 30 శాతం పంటభూముల్లో ఏదొక సూక్ష్మ పోషక లోపం ఉన్నట్టు పరిశీలనలో వెల్లడైంది.

వరి దిగుబడుల్లో జింక్ కీలక పాత్ర

వరి దిగుబడుల్లో జింక్‌కు అధిక ప్రాధాన్యత ఉంది. మొక్క ఎదుగుదలకు, నత్రజని, భాస్వరం, ఇతర పోషక పదార్థాల సమర్థ వినియోగానికి, మొక్కలో అమినో ఆమ్లాలు, మాంసకృత్తుల తయారీకి దోహదపడుతుంది. జింక్ లోపిస్తే ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి చిన్నవిగా అవుతాయి. పంటలో ఎక్కువ మోతాదులో నత్రజని, భాస్వరం ఎరువుల వాడకం వల్ల జింక్ లోపం వస్తుంది. ఒకేసారి వరి పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించే చోట రబీ సీజను ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. లోపం నివారణకు ఎకరాలకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింక్‌ను భాస్వరం ఎరువులతో కలిపి వేయకూడదు.

బోరాన్ ధాతు ప్రాముఖ్యత

వరితోపాటు అపరాలు, కాయగూరలు, పత్తి మొక్కల పూత దశలో సంపర్కం, ఫల దీకరణ, ఆకుల్లో తయారయ్యే ఆహారం మొక్కల్లోని అన్ని భాగాలకు చేర్చడంలో బోరాన్‌దే కీలక పాత్ర. సున్నంపాలు ఎక్కువుండే నేలల్లో బోరాన్ లోపం అధికంగా కనిపిస్తోంది. లోపం ఉన్న చెట్ల ఆకులు ముడుచుకుపోయి చిన్నవిగా తయారవుతాయి. కాయ దశలో కాయలు పగిలిపోతాయి. ఎకరానికి ఒక కిలో బోరాక్స్‌ను ఆఖరి దుక్కులో వేయాలి. బోరాన్ లోప నివారణకు ప్రతి మొక్కకు 100 గ్రాముల బోరాక్స్ లేదా బోరికామ్లాన్ని భూమిలో వేయాలి. 0.1-0.2 శాతం బోరాక్స్ లేదా బోరి కామ్లాన్ని కొత్తగా చిగురు వచ్చినప్పుడు 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నీటిపారుదల కింద సాగుచేసే పంటకు విత్తే సమయంలో ఎకరానికి నాలుగు కిలోల బోరాక్స్ వేయాలి.

జిప్సంతో చౌడు నివారణ

సూక్ష్మపోషకాల్లో కీలకమైన జిప్సం వినియోగించడం ద్వారా చౌడు భూములను తిరిగి పంటల సాగుకు అనుకూలంగా చేయవచ్చు. జిప్సం ఎరువులో కాల్షియం, గంధకం ధాతువులు ఉంటాయి. చౌడు భూముల్లో ఉండే మార్పిడి చెందే సోడియం తగ్గించి నేలను బాగు చేయడానికి జిప్సం ఎరువు అవసరం. జిప్సం ఎరువులోని కాల్షియం ధాతువు మొక్కలో కణకవచం తయారీకి, కణాల ఉత్పత్తి, సాగుదలకు, మొక్కల్లో సేంద్రియ ఆమ్లాలను తటస్థపరచడానికి, పత్రహరితం, క్రోమోజోములు ఏర్పడ్డానికి దోహదం చేస్తుంది. కారుచౌడు నేలలను బాగు చేయడానికి వేసవి వర్షాల సమయంలో జిప్సం వేసి కలియదున్నాలి. తర్వాత పొలంలో నీటిని నిలపాలి. భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా జిప్సం ఎరువు మోతాదును వేయాలి. అవి లేకుంటే ఎకరానికి 1.2-1.6 టన్నులు జిప్సం వేయవచ్చు. నూనె గింజల పంటలకు ఎకరాకు 200 కిలోల జిప్సం చివరి దుక్కిలో వేయాలి. వేరుశెనగ పైరుకైతే పూత దశలో వేసి నేలలో కలపాలి. సోయాచిక్కుడు, కంది, పెసర, మినుము, శనగ వంటి పైర్లకు జిప్సం ఎరువును చివరి దుక్కులో ఎకరానికి 50-100 కిలోలు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

మిగిలిన సూక్ష్మపోషకాలదీ ఇంతే..

ఇతర సూక్ష్మపోషకాల్లో కీలకమైన ఐరన్ ధాతు లోప నివారణకు ఎకరానికి 20కిలోల అన్నభేదిని ఆఖరి దుక్కులో వేయాలి. పైరుపై ఐరన్ ధాతు లోపాలు కనిపిస్తే ఎకరానికి ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాన్ని 200లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి 10 కిలోల మాంగనీస్ సల్ఫేట్ చివరి దుక్కులో వేయాలి. మొక్కలో విటమిన్-ఎ తయారీకి దోహదం చేసే రాగి ధాతువు కోసం ఎకరానికి రెండు కిలోల కాపర్ సల్ఫేట్‌ను 2-3 సంవత్సరాలకు ఒకసారి దుక్కులో వేయాలి.

టీడీపీ హయాంలో 100% సబ్సిడీ

వరి సహా అన్ని రకాల పంటల సాగులో కీలక పాత్ర పోషించే సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, జిప్సంలను 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలకు అనుగుణంగా నూరుశాతం సబ్సిడీపై ఎన్ఎఫ్ఎస్ఎం పథకం ద్వారా రైతులకు అందించింది. అంతకుముందు వీటిని 75-90 శాతం సబ్సిడీపై అందించేవారు. వీటిని రైతులు తమ భూములకు వినియోగించుకుని సత్ఫలితాలు పొందేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి సూక్ష్మపోషకాల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పుడు పొలంబడి రైతులకు మాత్రమే ఇస్తున్న సూక్ష్మపోషకాలను గతంలో మాదిరిగా భూసార పరీక్షల ఆధారంగా నూరుశాతం సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

దివాన్‌చెరువులో ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం

పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఇకపై ఇక్కడి నుంచే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా

దివాన్‌చెరువు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసే జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయం ఇటీవల దివాన్‌చెరువుకు మారింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళేశ్వరంలో దాదాపు 13 సంవత్సరాలు ఉన్న ఈ కార్యాలయం కొన్ని కారణాల వల్ల ఇక్కడికి మారింది. దివాన్‌చెరువులో జాతీయ రహదారిని అనుకుని ఉన్న విశాలమైన భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఈ కార్యాలయం ద్వారానే ఉచిత పాఠ్య పుస్తకాల సరఫరా జరుగుతుంది. దాంతో దాదాపు 40 లక్షల పాఠ్య పుస్తకాలు భద్రపరచుకునేందుకు అనువుగా విశాలమైన గోదాము ఉన్న భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటైంది.



పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు 18 లక్షల మూల్యాంకన పుస్తకాలు ఈ నెల 27వ తేదీకి దివాన్‌చెరువులోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయానికి చేరనున్నాయి. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అందజేసేందుకు 51 టైటిల్స్ మూల్యాంకన పుస్తకాలు రానున్నాయి. ఈ పుస్తకాలు ఇక్కడకు వచ్చాక ఈ కార్యాలయం నుంచి పూర్వ తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు సరఫరా చేస్తారు. ఈ విషయమై జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక కార్యాలయ మేనేజరు పి.సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇంతవరకు తమ కార్యాలయానికి 40వేల మూల్యాంకన పుస్తకాలు వచ్చాయని చెప్పారు. మిగిలిన పుస్తకాలు కూడా వచ్చాక మండలాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ పుస్తకాల పంపిణీ పూర్తయ్యిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుదల



ఏలేరు జలాశయంలో ఉన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. సాగు అవసరాలకు నీరు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు క్రమేణా తగ్గుతూ వస్తోంది. వర్షాలు సకాలంలో రాకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 77.10 మీటర్ల స్థాయిలో 10.31 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 150 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 600 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది. సాగు నీరు విడుదలవ్వడంతోపంటలపై రైతులకు భరోసా వచ్చింది.

సెటిల్ చేసుకోకపోతే షాప్ సీజ్ చేస్తాం!

- ఉమ్మడి జిల్లా పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులకు ఫేక్ కాల్స్
- డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అంటూ బెదిరింపు
- కాకినాడ పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా కెమిస్టులు

పిఠాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మీరు కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారు... వయాగ్రా మాత్రలు అమ్మారు... ఇలా మీ మీద ఫిర్యాదులు వస్తున్నాయి. మేము వస్తే షాప్ సీజ్ చేస్తాం. మీరు వచ్చి డబ్బులు ఇచ్చి సెటిల్ చేసుకోండి అంటూ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కొందరు ఆగంతకులు మెడికల్ షాపు యజమానులకు ఫేక్ ఫోన్లు చేస్తున్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని పలు షాపుల నిర్వాహకులకు గత 3 రోజులుగా పదుల సంఖ్యలో ఫేక్ ఫోన్లు రావడంతో కాకినాడ జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ అప్రమత్తమైంది. కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో జిల్లా సంఘ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కాకినాడతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, తుని, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల నిర్వాహకులకు కొందరికి 7032461950 నెంబర్ నుంచి కాల్స్ వచ్చినట్టు చెబుతున్నారు. ఇది హైదరాబాదులోని ఒక కాల్ సెంటర్ నుంచి వచ్చినట్టు సమాచారం. ఇవన్నీ తప్పుడు కాల్స్ అని, ఇటువంటివి వచ్చినప్పుడు సంభాషణ రికార్డు చేయాలని డ్రగ్గిస్టు అండ్ కెమిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కాల్స్ చేసిన వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ చంద్రశేఖర్

జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో మహిళా మెడికోల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం





సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్, క్రీడాపతాకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి, దేహధారుడ్యానికి క్రీడలు దోహదపడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో 3 రోజులపాటు జరిగే మహిళా మెడికోల 25వ స్పోర్ట్స్‌మీట్‌ను మంగళవారం ఆయన క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య విద్యతో పాటు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ క్రీడా మైదానంలో మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. యూనివర్శిటీ పరిధిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 24 మెడికల్ అండ్ దంత వైద్య కళాశాలల నుంచి 567 మంది క్రీడాకారిణులు పాల్గొంటున్నట్టు యూనివర్శిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. 3 రోజుల పాటు వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్, చెస్ తదితర క్రీడలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డీవీఎస్ శ్రీనివాసరావు, జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ మిశ్రా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ఒకరి మృతి

మరొకరికి గాయాలు



ఘటనా స్థలంలో వాహనాలు



చంద్రశేఖర్ (ఫైల్)

ఆలమూరు/అంబాజీపేట జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరానికి చెందిన వెంపల చంద్రశేఖర్(50) గత కొన్నేళ్లుగా అంబాజీపేట మండలం ఇరుసుమండలో నివాస ముంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐసర్ వ్యాన్‌తో సోమవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా రావులపాలెం వద్ద ఒక వ్యక్తి రాజమహేంద్రవరం వరకు వస్తానని వ్యాన్ ఎక్కాడు. ఆలమూరు మండలం మడికి వద్ద కూరగాయల మార్కెట్ వద్ద సాంకేతిక లోపంలో ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందగా వ్యాన్‌లో ఉన్న మరో ఒక వ్యక్తి గాయపడ్డాడు. దీంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు



రాముడు (ఫైల్)

పి.గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం- అమలాపురం ప్రధాన రహదారి పోతవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ముంగండ శివారు ఇటుకల మెరకకు చెందిన మోకా కళ్యాణ్‌రాముడు (45) తన మేనల్లుడు గణేష్‌నగర్‌కు చెందిన కుసుమ రవికుమార్‌తో కలిసి పి.గన్నవరం వచ్చాడు. తన పని ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో కోకోనట్ కల్యాణ మండపం దాటి కోతవేటు దూరం వెళ్లగానే అమలాపురం వైపు నుంచి బుల్లెట్‌పై గన్నవరం వస్తున్న వ్యక్తి ఢీ కొన్నాడు. ఈ ఘటనలో కల్యాణరాముడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందగా రవికుమార్‌కు గాయాలు కావడంతో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్‌రాముడు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ పేర్కొన్నారు.

చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల స్వాధీనం

పోలీసుల అదుపులో ఇద్దరు బాలురు



రౌతులపూడిలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

రౌతులపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో 30 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదును రౌతులపూడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు మంగళవారం విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈనెల 13న రౌతులపూడిలో పేంటి మరియమ్మ ఇంట్లో 30 గ్రాముల బంగారం, రూ.30,000 నగదు చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలతో రౌతులపూడికి చెందిన ఇద్దరు బాలురను మంగళవారం మధ్యాహ్నం రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మ గుడి వద్ద అదుపులోకి తీసుకున్నారు. సీసీఎల్ఎస్‌ను జిల్లా పీవో ముందు హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో హెడ్‌కానిస్టేబుల్ డివిరమణ, కానిస్టేబుళ్లు బోస్, నూకరాజు, ఉదయ్ ఉన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని విద్యార్థి మృతి



వెంకటేష్ (ఫైల్)

కరప, జూలై 22(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని కాలేజీకి వెళ్తున్న విద్యార్థి మృతిచెందాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన కోసూరి వెంకటేష్(22) కాకినాడ ఆదిత్య కళాశాలలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వెంకటేష్ తండ్రి సుబ్రహ్మణ్యం కాకినాడలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి స్థానిక కొప్పిశెట్టివారిపేటలో చిన్న హోటల్ నిర్వహిస్తోంది. సుబ్రహ్మణ్యం రోజూ కుమారుడిని బండిపై తీసుకెళ్లి కాలేజీ వద్ద దింపి అక్కడి నుంచి డ్యూటీకి వెళ్లేవాడు. మంగళవారం ఉదయం పని ఉందని చెప్పి తండ్రి ముందుగానే డ్యూటీకి వెళ్లిపోయాడు. దీంతో వెంకటేష్ కొద్ది నెలల క్రితం తండ్రి కొనిచ్చిన సుమారు రూ.4లక్షల విలువైన బుల్లెట్‌పై కళాశాలకు బయలుదేరాడు. వేళంగి దళమ్మచెరువుగట్టు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి వస్తున్న గుర్తుతెలియని మోటర్‌సైక్లిస్ట్ వెంకటేష్‌ను బలంగా ఢీకొని ఆగకుండా పోయాడు. తలకు తీవ్రగాయాలైన వెంకటేష్‌ను తండ్రి సుబ్రహ్మణ్యం హుటాహుటిన కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

మినీ బస్సులో మరణం అంచుకు..

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు బోల్తా
- 21 మందికి గాయాలు
- లోయలో పడకుండా చూసిన డ్రైవర్
- బాధితులంతా రాజమండ్రి వాసులు
- విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స



ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మినీ బస్సు డ్రైవర్ కుమార్ స్వామి



బోల్తాపడిన మినీ బస్సు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఘాట్ రోడ్డులో మినీ బస్సు మంగళవారం బోల్తా కొట్టింది. ప్రమాదంలో 21 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ కుమార్‌స్వామి చాకచక్యంతో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. బ్రేకులు ఫెయిలై లోయలో పడాల్సిన బస్సును కొండను ఢీకొనేలా చేయడంతో గాయాలతో బయటపడ్డామని క్షత గాత్రులు తెలిపారు. వారంతా విజయనగరం జిల్లా శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయ పడ్డవారంతా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వాసులు. వారితో మినీ బస్సులో ప్రయాణించిన ఎస్.నాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రాజమండ్రి పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు 20మంది వరకు రాజమండ్రి జేఎన్ రోడ్డులోని అడమ్ సెలూన్‌లో పనిచేస్తున్నారు. వీరంతా అరకు చూడాలనుకున్నారు. ఓ మినీ బస్సులో సోమవారం రాత్రి రాజమండ్రి నుంచి బయలుదేరారు. మంగళవారం ఉదయం నుంచి బొర్రాగుహలు, అరకు, అనంతగిరి ప్రాంతాల్లో ఉన్న జలపాతాలను చూశాక సాయంత్రం రాజమండ్రికి తిరుగు ప్రయాణమయ్యారు. 6 గంటల సమయంలో శివలింగపురం, టైడా మధ్యకు వచ్చేసరికి మినీ బస్సుకు బ్రేక్‌లు ఫెయిల్ అయినట్లు డ్రైవర్ కుమార్‌స్వామి గుర్తించాడు. రోడ్డుకు ఒక పక్క లోయ, మరోపక్క కొండ ఉంది. బస్సు లోయవైపు లాగేస్తుండగా బస్సు ఆగకుండా చూసి మరోపక్కనున్న కొండను ఢీకొన్నాడు. దీంతో మినీ బస్సు బోల్తా పడింది. బస్సులో ఉన్న వారందరికీ సీట్లు, రాడ్లు, అద్దాలు తగిలి గాయపడ్డారు. కొందరికి తలకు తీవ్రగాయాలు కాగా మరి కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రమాదంపై శృంగవరపుకోట 108 వాహన ఉద్యోగులు ఎంఎస్ఎన్ మూర్తి, రమేష్‌కు సమాచారం అందింది. వారు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని తీవ్రంగా గాయపడ్డవారిని శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఎస్.కోట నుంచి మరో 108 వాహనంలో మరికొందరిని తీసుకొచ్చారు. మిగిలిన వారిని అల్లూరి జిల్లా అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో తెచ్చారు. వారందరికీ ఎస్.కోట ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్స అందించారు. డ్రైవర్‌తో సహా 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ కుమార్ స్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టే అవకాశం

అన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శానిటరీ వర్కర్స్‌కు పీఎఫ్ చెల్లించకుండా నకిలీ ఈపీఎఫ్ రసీదులను చూపించి కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధికారులను మోసం చేసిన విషయంలో కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థపై మంగళవారం రాత్రి దేవస్థానం శానిటరీ విభాగ అధికారులు ఫిర్యాదు చేశారు. ఉదయం ఈవో సుబ్బారావు, శానిటరీ విభాగ అధికారులు రాజమండ్రి పీఎఫ్ కార్యాలయానికి వెళ్లి వివరాలు తీసుకుని న్యాయసలహా తీసుకున్నారు. దీంతో అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంది. సదరు కాంట్రాక్ట్ సంస్థపై చీటింగ్ కేసు నమోదు చేస్తారని సమాచారం. మరోపక్క కాంట్రక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది. గార్డెన్ నందు ఇదే సంస్థ ద్వారా పలువురు సిబ్బంది పని చేస్తుండగా దానిని రద్దు చేసి మరో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తారో వేచిచూడాలి.

పెరిగిన గోదావరి ప్రవాహం

83,208 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద ప్రవాహం ఒక మోస్తరుగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 83208 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4700 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటి మట్టం 16.30 అడుగులుగా నమోదైంది.

నేడు 'లోవ'లో సహస్ర ఘటాభిషేకం

తునిరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ పండితులు రాణిశర్మ తెలిపారు. అమ్మవారిని సప్తనదీ జలాలతో అభిషేకించి వరుణపూజ నీరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహిస్తారన్నారు. 24వ తేదీతో ఆషాఢ మాసోత్సవాలు ముగుస్తాయన్నారు.

రంప మన్యంలో తగ్గిన మావోయిస్టు కార్యకలాపాలు : డీఎస్పీ

రంపచోడవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన నిరంతర, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాల కారణంగా రంపచోడవరం మన్యంలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. మావోయిస్టు సానుభూతిపరులు, భూగర్భ కార్యకర్తలు హింస మార్గాన్ని వదిలి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వ్యక్తులకు పునరావాస విధానాల ప్రకారం గౌరవప్రదమైన పునః ఏకీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

చినజగ్గంపేటలో ఆక్రమణలపై సర్వే

ఇరువర్గాల మోహరింపు, ఉద్రిక్తత

పోలీసు బందోబస్తు ఏర్పాటు



మోహరించిన ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు



ఆక్రమణలపై సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

గొల్లప్రోలు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో ఆక్రమణలపై అధికారుల సర్వే ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరువర్గాలు భారీగా మోహరించడంతో పోలీసు బందోబస్తు మధ్య సర్వే కొనసాగించారు. గ్రామంలోని 17.35 ఎకరాల విస్తీర్ణంలో గల బూర వారి చెరువు, 14.35 ఎకరాల విస్తీర్ణంలోని వెంకట్రాజు చెరువు, ఎస్సీలకు ఇచ్చిన భూములు ఆక్రమణకు గురయ్యాయని కాకినాడ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు తహశీల్దార్ పీవీ గోపాలకృష్ణ, పీబీసీ డీఈఈ సంతోష్‌కుమార్, ఏఈ పద్మజ, మండల సర్వేయర్ కేదారేశ్వరరావు ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేపట్టారు. ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని 2 వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సర్వేను కొనసాగించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

అమలాపురంలో ఇద్దరు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వ్యక్తులపై బాధితులు మంగళవారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోనసీమ జిల్లా అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన సిరసపల్లి ఉదయ్‌శంకర్, రావులపాలెనికి చెందిన దోనిపాటి మహేష్ మున్సిపల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నామని నమ్మబలికారు. మున్సిపల్ డిపార్టుమెంటులో రికార్డు అసిస్టెంట్, ఫీల్డు అసిస్టెంట్, అక్కౌంటెంట్ తదితర పోస్టులు ఉన్నాయని, పోస్టు ఒక్కింటికీ రూ.1.20లక్షలు, రూ.2.50లక్షలు అవుతుందని ముందుగా సగం సొమ్ము అడ్వాన్సుగా ఇవ్వాలని నమ్మించారు. జాబ్ వచ్చిన తరువాత మిగిలిన సొమ్ము ఇవ్వవచ్చని చెప్పారు. ఉద్యోగాల కోసం ఆశపడ్డ ఆరుగురు రూ.7.20లక్షల సొమ్మును అమలాపురానికి చెందిన యల్లమిల్లి విజయ్, ఉరదాల బాలరాజు, పేరూరుకు చెందిన వాసర్ల శ్రీనివాస్ సమక్షంలో సొమ్ములు చెల్లించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలలు గడిచిపోతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదు. ఎప్పుడూ ఏదో ఒక కారణం చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ వ్యహారంపై ఈనెల 12న ఉదయ్‌శంకర్‌ను పట్టుకుని పెద్ద మనుషుల సమక్షంలో పెట్టగా అతడు దోనిపాటి మహేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించడం కుదరదని, డబ్బులు తిరిగి చెల్లిస్తామని పెద్దల సమక్షంలో నమ్మించారు. ఆ తరువాత వారిద్దరు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. ఒక దశలో రూ.6.40 లక్షల నకిలీ చెక్కును ఉదయ్‌శంకర్ పెద్దల సమక్షంలో వేరొకరి సంతకంతో ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లదని తమ సొమ్ములు తమకు నగదురూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి తాము పెద్ద మనుషుల వద్దకు తిరుగుతూనే ఉన్నామని వివరించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి మోసం చేసిన ఉదయ్‌శంకర్, మహేష్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, తమ సొమ్ములు తమకు తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో కోరారు. అయితే ఈ వ్యవహారంపై అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంపై అమలాపురం పట్టణ, అల్లవరం పోలీసుస్టేషన్లలో సైతం బాధితులు ఫిర్యాదులు చేశారు. ఇటీవల దోనిపాటి మహేష్‌ను కొందరు కొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్‌ను ఉన్నత వైద్యం కోసం కాకినాడ తరలిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మరణించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి రాజానగరం-నరేంద్రపురం కూడలిలో మంగళవారం జరిగింది. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన చవల శ్రీనివాస్(38) కొంతమూరులో ఉంటూ స్కూటీపై ఊరూరా తిరిగి రాగి కడియాలు అమ్ముకుంటున్నాడు. పెద్దాపురంలో మరిడమ్మ తీర్థంలో కడియాలు అమ్ముకునేందుకు కొంతమూరు నుంచి స్కూటీపై బయలుదేరాడు. రాజానగరం- నరేంద్ర పురం జంక్షన్ వద్ద లారీ వెనుక నుంచి ఢీకొంది. శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.

కోటి తలంబ్రాల పంటకు వానర హారతి



గోకవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం అచ్చుతాపురంలో శ్రీరామ నామ ధ్యాన యజ్ఞంలో భాగంగా మంగళవారం కోటి తలంబ్రాల పంటకు వానర హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామతత్వాన్ని ప్రచారం చేస్తున్న కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల జ్ఞాన యజ్ఞం కొన సాగిస్తున్నారు. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలుత విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించారు. అనంతరం అక్కడ నుంచి అచ్చుతాపురం తీసికొచ్చి కళ్యాణం చక్రవేణి పొలంలో చల్లారు. రాముడు, ఆంజనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు వేషధారణలతో భక్తులు ఈ వరిసాగు ప్రారంభించారు. పంట అనంతరం ధాన్యాన్ని నాలుగు రాష్ట్రాల్లోని 5వేల మందికి అందించి తద్వారా వాటిని శ్రీరా మనామస్మరణతో గోటితో ఒలిచి 800 కిలోల తలంబ్రాలను సిద్ధం చేస్తారు, అనంతరం భద్రా చలం (15వ సారి), ఒంటిమిట్ట(8వ సారి), అయోధ్య(4వ సారి)లకు సమర్పించనున్నట్టు సంఘం అధ్యక్షుడు అప్పారావు పేర్కొన్నారు.



అచ్చుతాపురంలో వివిధ వేషధారణలతో వరిసాగు ప్రారంభిస్తున్న భక్తులు

అమలాపురం

కూటమి పాలనలో ప్రజలు సుభిక్షం

● సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలోఎమ్మెల్సీ రాజశేఖరం



రాజోలు: కడలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

రాజోలు,జూలై 22(ఆంధ్రజ్యోతి):ఎన్డీఏ కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. కడలి వాసంశెట్టివారిపాలెంలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగారు. ఎమ్మెల్సీ రాజశేఖరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో సామాజిక పింఛను, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి సంక్షేమ కార్యక్రమాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు పూర్తి చేసుకున్నాయన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాలు అమలుచేస్తారన్నారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, మామిడిశెట్టి నాగరాజు, కడలి మోహన్, నారాయణమూర్తి, కృష్ణమోహన్, యాండ్ర దొరబాబు, అడబాల విజయ్, పాటి నాగరాజు, గుబ్బల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

అమలాపురం రూరల్: కామనగరువులో మంగళవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను పై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి వీరేష్ కుమార్, నాయకులు రాజులపూడి భీముడు, వాకా శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో సుపరిపాలన నడుస్తుందని రాజోలు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మామిడికుదురులో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో కంచి విశ్వనాథం, నామన రాధాకృష్ణ, అప్పారి వెంకటేశ్వరరావు, వర్ధినేని బాబ్జి, కడలి రమేష్, పెచ్చెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, తెలుగురైతు అధ్యక్షుడు యెనుముల శ్రీధర్, గ్రామశాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన చంద్రరావు, కటికిరెడ్డి వీరవెంటసత్యనారాయణ, యెనుముల రమణ, కలిగితి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణలో కమిటీలదే కీలకపాత్ర: సీడీపీవో

ముమ్మిడివరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణలో గ్రామస్థాయిలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతమైన సేవలు అందించాలని సీడీపీవో ఎం.నిహారిక పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, చైల్డ్ బెగ్గింగ్, బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలను నిరోధించడంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో వీటిని అరికట్టడం ద్వారానే బాలికా సంక్షేమం, రక్షణ సాధ్యమవుతుందన్నారు. డీసీబీవో డి.ఉమాలక్ష్మి, సీఐ ఎం.మోహన్‌కుమార్, తహశీల్దార్ టి.సుభాష్, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణిలు మాట్లాడుతూ బాలకార్మిక నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్, ఏపీఎం వీవీ వెంకటరమణలు మాట్లాడుతూ మంచి కుటుంబ వ్యవస్థ ద్వారానే పిల్లలు వికాసవంతులవుతారన్నారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీవోలు, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంబాజీపేట: శాకంబరిగా వనువులమ్మ



కొర్లపాటివారిపాలెంలో ఆషాఢం సారె సమర్పించేందుకు వెళుతున్న మహిళలు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ముత్యాలమ్మ, కనకదుర్గమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో పాటెమ్మ తల్లి

వైభవంగా అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ

● శాకంబరి అలంకరణలో గ్రామదేవతలు

అంబాజీపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ఉన్న గ్రామదేవతలను కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. కె.పెదపూడి శ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారు, కొర్లపాటివారిపాలెం వనువులమ్మతల్లి, చిరతపూడి వనువులమ్మ తల్లి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కొర్లపాటివారిపాలెం ఉన్న శ్రీ వనువులమ్మ అమ్మవార్కి గ్రామస్థులు, మహిళల ఆధ్వర్యంలో వివిధ రకాల స్వీట్లు, పండ్లు ప్రత్యేకంగా తయారు చేసిన రెండెడ్ల బండి, గుర్రపు బండిపై అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సత్తెమ్మతల్లికి ఆషాఢం సారె

ముమ్మిడివరం: గ్రామం సుభిక్షంగా ఉండాలని పసుపు కుంకాలతో జీవనం సాగాలని, గ్రామమంతా సిరిసంపదలతో ఉండాలని కోరుతూ సత్తెమ్మతల్లి, అమ్మవారికి వనుమువులమ్మ అమ్మవారికి ఆషాఢం సారె, చీర నివేదించారు. మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారికి, వనువులమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, పండ్లు, చలివిడి పానకాలు, వడపప్పు, పట్టువస్త్రాలు, నిమ్మకాయల దండలు, స్వీట్లతో శోభాయాత్రగా అమ్మవారి నామజపం చేస్తూ భాజాభజంత్రీలతో అమ్మవారిని దర్శించుకున్నారు.అలాగే చినకొత్తలంకలో సత్తెమ్మతల్లి అమ్మవారికి గ్రామస్తులు ఆషాడం సారెను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి

అయినవిల్లి: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆషాడమాసం చివరి మంగళవారం కావడంతో అన్నపూర్ణాదేవిని శాకంబరిగా అలంకరించారు. కుంకుమార్చనలు నిర్వహించారు.

కాట్రేనికోన: మార్కెట్ వీధిలో శ్రీభాగిర్థమ్మ, కనకదుర్గ అమ్మవార్లకు ఆషాడం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సారె, చీరలు, సమర్పించారు. ముందుగా కాట్రేనికోన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి అనంతరం సారె సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఉప్పూడి గంగాదేవర మల్లమ్మ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు.

శాకంబరిగా పాటెమ్మ అమ్మవారు

పి.గన్నవరం: మండలంలోని పోతవరం గ్రామదేవత శ్రీగంగాలమ్మతల్లి, పాటెమ్మ అమ్మవారిని గ్రామస్థులు ఆధ్వర్యంలో సమకూర్చిన కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అల్లవరం: డి.రావులపాలెం గ్రామదేవత సోమాలమ్మవారికి మహిళలు భక్తి ప్రపత్తులతో మంగళవారం ఆషాడం సారె సమర్పించారు. మహిళలంతా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి గ్రామదేవతకు మిఠాయిలు, చీరలు, పసుపుకుంకుమలు సమర్పించారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక గ్రామంలో పోలేరమ్మ, ముత్యాలమ్మ, మహలక్ష్మమ్మ, కనకదుర్గమ్మవార్లకు ఈ సందర్భంగా భక్తులు సారె సమర్పించారు.

ఘనంగా సత్తెమ్మ సంబరం

సఖినేటిపల్లి మండలం అంతర్వేది బెల్లంకొండవారి కొడపలో శ్రీసత్తెమ్మ అమ్మవారి సంబరం అంబరాన్నంటేలా జరిగింది. ఘనాసరి చెన్నంశెట్టి శ్రీను, గ్రామస్తుల సహకారంతో గ్రామోత్సవం అనంతరం సముద్రం వద్దకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మరలా తిరిగి సత్తెమ్మవారి తాడి వద్దకు వచ్చి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.



సత్తెమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

శ్రీసుబ్బాలమ్మ జాతర సేవ

అమలాపురం టౌన్: అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లి సేవా మహోత్సవం మంగళవారం శ్రీసుబ్బాలమ్మతల్లి మినీ గూడ్స్ ఆటో యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గరగ నృత్యాలు, భాజభజంత్రీలు, డోలు సన్నాయిలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి చలిమిడి, పానకం, నైవేద్యాలు సమర్పించి అమ్మవారికి ఆషాడం సారె అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొలిశెట్టి త్రిమూర్తులు, ఉపాధ్యక్షుడు పెచ్చెట్టి పండు, కడలి సత్యనారాయణ, లక్కింశెట్టి నిత్యానందం, వస్కా మల్లేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీసుబ్బాలమ్మ తల్లి

మండపాల ఏర్పాటుకు వేలంపాట

ఐ.పోలవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పెండ్లి మండపాల ఏర్పాటుకు మంగళవారం వేలం నిర్వహించారు. ఐ.పోలవరానికి చెందిన వెంకటభవాని ఏడాదికి రూ.8,31, 000లకు వేలం పాటదక్కించుకున్నారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో పాట నిర్వహించారు.



రంగారావు వర్మ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

సొసైటీ అధ్యక్షుడిగా వర్మ ప్రమాణ స్వీకారం

కాట్రేనికోన, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పెసింగి రంగారావువర్మ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు సభ్యులుగా మోకా అప్పాజీ, చేకూరి వెంకటకృష్ణంరాజు ప్రమాణస్వీకారం చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నాగిడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, నీటిసంఘం అధ్యక్షుడు ఆకాశం శ్రీనివాస్, కాట్రేనికోన మండల టీడీపీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కాట్రేనికోన మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు మోకా బాలప్రసాద్, నాయకులు దాట్ల పృథ్వి, విత్తనాల వెంకటరమణ, వనచర్ల వెంకటేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, పీఏసీఎస్ రాజు, విత్తనాల బుజ్జి, వడ్డి యోగీశ్వరి, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ముదే నూకరాజు, పల్లిపోలు శ్రీనివాసవర్మ, కాట్రేనికోన డీసీసీబీ మేనేజర్,మండల పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం



ఓగూరి భాగ్యశ్రీని సత్కరిస్తున్న నాయకులు

కాట్రేనికోన, జూలై 22(ఆంధ్రజ్యోతి): తనకు పదవి రావడానికి కారకులైన కూటమి నాయకులను కలిసి ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం చెయ్యేరు వెళ్లిన భాగ్యశ్రీకి ఆక్వా రైతు సంఘం సలహాదారుడు, జనసేన నాయకుడు త్సవటపల్లి నాగభూషణం నాయకత్వంలో ఘనస్వాగతం పలికారు. భాగ్యశ్రీకి పట్టుచీర, బుద్ధుని ప్రతిమ ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంబాల రమేష్, చెయ్యేరు ఉపసర్పంచ్ త్సవటపల్లి నారాయణస్వామి, నాయకులు నూకల దుర్గబాబు, కాయల బలరామ్, త్సవటపల్లి మణికుమార్, త్సవటపల్లి పార్థసారధి, బళ్ళ కుమార్, గిడ్డి రత్నశ్రీ, రంబాల చౌదరిబాబు, బీమాల సూరిబాబు, గాలిదేవర బుల్లి, నంద్యాల సురేంద్ర, పోలిశెట్టి రాజు, అడపా సాయి, గాలిదేవర గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



ముక్కామలలో పశువైద్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆవుదూడతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకుని పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అంబాజీపేట మండలం ముక్కామలలో ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.32లక్షలతో నూతనంగా నిర్మించిన పశువైద్యశాలను ఎమ్మెల్యే సత్యనారాయణ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చెందేలా కృషిచేయాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండి స్థానిక పశువైద్యులతో సంప్రదించాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ వనచర్ల గంగాభవాని, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం, పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.విజయరెడ్డి, పశువైద్యులు దీపిక, నాయకులు దాసరి సత్యనారాయణ, కొర్లపాటి గోపి, బండారు మల్లిబాబు, కుడుపూడి రాంబాబు, రామకృష్ణ, పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ముక్కామల పీహెచ్‌సీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పీహెచ్‌సీ చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాల నుంచి రోగులు వస్తున్నారని వైద్యసేవలు అందించేందుకు సరిపోవడంలేదని వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రోగులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులతోపాటు గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు.

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం



స్వామివారి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, జూలై 22(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి అలంకరించారు. విశ్వక్సేనపూజ, పాణిగ్రహణం, మాంగల్యధారణ వైభవంగా భక్తుల గోవిందనామస్మరణల మధ్య అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడిచేసిన వారిని అరెస్టుచేసి శిక్షించాలి



డీఎస్పీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత ఐక్యవేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాదిరూపాయలు వసూలుచేసి మధ్యవర్తిగా ఉన్న దళిత యువకుడు దోనిపాటి మహేష్‌కుమార్‌పై పాశవికంగా దాడిచేసిన దోషులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని జిల్లా దళిత ఐక్యవేదిక దళిత బహుజన మహిళాశక్తి, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దాడికి గురైన బాధితుడు మహేష్‌కుమార్‌ను మంగళవారం పరామర్శించారు. అనంతరం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ డీబీ లోక్, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డవారిని శిక్షించాలి

ఐ.పోలవరం: దళిత యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ మాలమహానాడు సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం పాతయింజరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన అత్యవసర సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అమలాపురం రాయల్ కళాశాల సిబ్బంది తాము మంత్రి అనుచరులమని చెప్పుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయల దందా చేస్తున్నారని ఆరోపించారు. దళిత యువకుడు దోనిపాటి మహేష్‌ను పిలిపించి విచక్షణారహితంగా అతనిపై దాడికి పాల్పడ్డారని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి యల్లమిల్లి విజయ్ తోపాటు 15మందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రేవు శ్రీనివాస్, వడ్డి గౌతమ్, మట్ట గగనవీరుడు, కాశి పరివాజ్‌కుమార్, రెడ్డిబాబు, సాధనాల బాబూరావు, పండు విజయ్‌కుమార్, నాగాబత్తుల రామకృష్ణ, యలమంచిలి వాసు, యలమంచిలి సురేష్, ఉండ్రు శివరాజు, గుట్టాల ప్రసాద్, గుంటూరు లవరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం

ముమ్మిడివరం: దళిత యువకుడు దోనిపాటి మహేష్‌పై విచక్షణారహితంగా దాడిచేసిన దోషులను వెంటనే అరెస్టుచేయాలని రిపబ్లికన్ పార్టీ జిల్లా కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాస్, మాలమహానాడు జేఏసీ నాయకుడు దేవరపల్లి ఏడుకొండలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేఖరులతో మాట్లాడారు. అమలాపురంలోని ఒక కళాశాలను అడ్డాగా చేసుకుని ఒక ముఖ్య నాయకుడి అనుచరులు ఈ ఆగడాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంలో దోనిపాటి మహేష్‌ను విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచారన్నారు. దోనిపాటి మహేష్‌పై దాడిచేసి గాయపరిచిన నిందితులను ఇంత వరకు పోలీసులు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దళితులపై దాడులుచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.

కూనవరం సొసైటీ చైర్మన్‌గా రామారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

ఉప్పలగుప్తం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎ.కూనవరం సొసైటీ త్రీమెన్ కమిటీ పదవీప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా ఆకుల రామారావు ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులుగా బొక్కా నాగరాజు, పండు ఈశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, సీఈవో ఆకుల వీరగణేష్, ఆకుల బుజ్జి, మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్బరాజుకు డాక్టరేట్



మలికిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నాగార్జున కనస్ట్రక్షన్ కమిటీ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఆర్ఎస్ సుబ్బరాజుకు సోక్రటీస్ సోషల రీసెర్చ్ యూనివర్శిటీ న్యూఢిల్లీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందినట్టు తెలిపారు. దీనితో పాటు అంతర్జాతీయ కర్మశీల్ అవార్డును అందుకున్నట్టు చెప్పారు. సుబ్బరాజు మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం చదివి సింగరేణి కాలరీస్ కంపెనీలో పనిచేశారు. ఎన్‌సీసీ లిమిటెడ్‌లో పలు పదవులు నిర్వహించారు. తదుపరి కంపెనీ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. సుబ్బరాజు డాక్టరేట్ పొందడంపట్ల పలువురు అభినందించారు.

'భావవ్యక్తీకరణపై పట్టు ఉండాలి'

మలికిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి భావవ్యక్తీకరణపై పట్టు ఉండాలని ఫ్లోరిడాకు చెందిన అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ డైరెక్టర్ అల్లూరి రమేష్‌వర్మ అన్నారు. మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో త్వరలో ప్రారంభించు కంప్యూటర్ హార్డ్‌వేర్ నిర్వహణ, వర్క్‌షాపు ధ్రువీకరణపత్రం కోర్సుకు సంబంధించిన అవగాహన సదస్సులో విద్యార్థులతో మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం దూసుకుపోతుందన్నారు. అందులో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీ మొదటి ఏడాది నుంచే భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. ప్రతీ విద్యార్థి కంప్యూటర్ కోడింగ్ నిపుణతతో పాటుగా హార్డ్‌వేర్ కూడా నేర్చుకోవాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కనీసం కంప్యూటర్ పరికరాల నిర్వహణపై కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ కళాశాలలో జరగబోయే 45 రోజుల శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌మహానీ, చిట్టాల సత్యనారాయణ, పీఎస్ఎన్ రాజు, ప్రసాద్, మణికంఠ, విజయ్‌ప్రసాద్, హర్షిత, కృపామాధురి, కుమారి, దేవకీ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో పుదుచ్చేరి కాంగ్రెస్ నాయకులు

యానాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. పుదుచ్చేరిలో 2026 ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. పుదుచ్చేరి ఎంపీ వి.వైద్యలింగం, మాజీ సీఎం నారాయణస్వామి, సీఎల్పీ లీడర్ వైద్యనాథన్ నేతృత్వంలో పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాంకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులు రాహుల్‌ను కలిశారు. రానున్న ఎన్నికలకు సంబం ధించిన అంశాలపై రాహుల్‌తో చర్చించారు. వచ్చేఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్ పాల్గొన్నారు.

బాలయోగీశ్వరులను దర్శించుకున్న పాండిచ్చేరి ఎస్పీ

ముమ్మిడివరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడిరంలోని శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని పాండిచ్చేరి ఎస్పీ భక్తవత్సల్యం మంగళవారం సందర్శించారు. బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు బాలయోగీశ్వరుల జీవిత చరిత్ర పుస్తకాలను ఆయనకు అందించారు. బాలయోగీశ్వరుల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

'ప్రత్యేక శ్రద్ధతో స్కూలు బస్సులు నడపాలి'



దేవిశెట్టి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాల సీజన్ ప్రారంభమైనందున బడి పిల్లలతో ప్రయాణించే స్కూలు బస్సులు, కళాశాల బస్సులను ప్రత్యేక శ్రద్ధతో నడపాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు బస్సు డ్రైవర్లకు సూచించారు. ప్రధానంగా వేగ నియంత్రణ పాటించాలని రోడ్డుమార్జిన్‌ను గమనించుకుంటూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. బడి బస్సులను సెల్‌ఫోన్ మాట్లాడుతూ అతి వేగంతో నడిపితే సదరు డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సును సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇటీవల రాజోలులో బస్సును వేగంగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో 30 రోజుల పాటు డ్రైవరు లైసెన్సు సస్పెండ్ చేశామని తెలిపారు. రహదారి భద్రతా వైఫల్యాలను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే అన్ని స్కూళ్ళు, కళాశాలల యాజమాన్యాలకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు తగు భద్రతా చర్యలు తెలియచేశారని శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా త్యాగరాజస్వామి గానసభ వార్షికోత్సవం

ముమ్మిడివరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రీత్యాగరాజస్వామి గానసభ 12వ వార్షికోత్సవ వేడుకలను ముమ్మిడివరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత త్యాగరాజస్వామివారి చిత్రపటాన్ని కోన అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. శ్రీత్యాగరాజ వాణిజ్య కళాకారుల సంక్షేమ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ముమ్మిడివరం సూరేశ్వరస్వామి దేవస్థానం, అయ్యప్పస్వామివారి ఆలయ ప్రాంగణంలో విశాఖ, తిరుపతి తదితర జిల్లాల నుంచి తరలివచ్చిన నాదస్వర, వేణుగానం, డోలు విద్వాంసులు, తబలా, గాత్ర కళాకారులచే కచేరీ నిర్వహించారు. అనంతరం ప్రముఖ నాదస్వర విద్వాంసులు షేక్ సతారసాహెబ్(అన్నవరం), కోన అప్పారావు మాస్టారులను కౌన్సిలర్ దివి మహాలక్ష్మి, సరిపెల్ల రామకృష్ణంరాజు, కళాకారుల సంఘ అధ్యక్షుడు డి.సూరిబాబు, ఎస్.రాధాకృష్ణ తదితరులచే ఘనంగా సత్కరించారు.


నంది అవార్డు గ్రహీత అబ్బులుకు సత్కారం



అబ్బులును సత్కరిస్తున్న తహశీల్దారు, సిబ్బంది

పి.గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడ గుజ్జాల సరళదేవి ఫంక్షన్ హాలులో జరిగిన జాతీయస్థాయి ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ప్రతిభావంతుల ఎంపికలో రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్న అబ్బులను తహశీల్దారు పల్లవి సత్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దారు పల్లవి మాట్లాడుతూ అబ్బులు గతంలో రెవెన్యూ ద్వారా స్పోర్ట్స్ విభాగాలలో ప్రతిభను కనబరిస్తూ మార్షల్ ఆర్ట్స్‌తోపాటు అనేక కళా రంగాలలో అలుపెరగని సాధన చేస్తూ ఈస్థాయికి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సత్యనారాయణ, ఆర్ఐ కె.దాంగే, సీనియర్ అసిస్టెంట్ స్వామీజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన కొల్లి వెంకటరమణ

ముమ్మిడివరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం జగనన్న కాలనీకి చెందిన కొల్లి వెంకటరమణ అదృశ్యమయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటరమణ తిరిగి రాలేదని అతని కుమారుడు రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటరమణ ఆచూకీ తెలిసిన వారు 8121437178కు సమాచారం అందించాలని అతను కోరాడు.

చిరుధాన్యాల పంటలపై అవగాహన

రాజోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పొన్నమండలో చిరుధాన్యాలు, పంటలు, వాటి ఉప ఉత్పత్తుల ఆరోగ్య ప్రయోజనం గురించి ఏడీఏ రాజశేఖర్, ఏరువాక కేంద్రం సైంటిస్ట్ నందకిశోర్ రైతులకు వివరించారు. ఏవో మనోహర్, సర్పంచ్ బేబికుమారి, వ్యవసాయాధికారి మధుకుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలు వినియోగించుకోవాలి

మామిడికుదురు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని మండల వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ సూచించారు. పాశర్లపూడిలంక గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ కొబ్బరి తోటల్లో అంతర పంటలు పండించడంవల్ల అదనపు ఆదాయం పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో చెరుకూరి సత్తిబాబు, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేబీఆర్ కళాశాలలో డ్రగ్స్‌పై కళాజాత ప్రదర్శన

అమలాపురం టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో మంగళవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు, వయోవృద్ధుల సంక్షేమంపై సంబంధిత శాఖ ఆధ్వర్యంలో తొలుత కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎండీ బాబ్జి బుర్రకథ బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పొదలాడకు చెందిన పల్లపోతు నాగేశ్వరరావు రూ.25,016లు, వరంగల్‌కు చెందిన నండూరి వెంకట ఉమామహేష్ రూ.10,000లు మంగళవారం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో హుండీ సొమ్ము చోరీ

అల్లవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): తూర్పులంక గ్రామంలో ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారంరాత్రి దుండగులు హుండీని పగులకొట్టి రూ.20వేల సొమ్మును దోచుకుపోయారు. అమ్మవారి ఆలయ హుండీ చోరీకి గురైందని అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రమాదకర పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ తప్పనిసరి

ఆర్డీవో శ్రీకర్



సమీక్ష నిర్వహిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్‌డ్రిల్ నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సంక్షోభ నివారణ కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ముందుగా రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రమాదకర పరిస్థితులను గుర్తించి వాటి ప్రమాదాలపై కంపెనీలోను, ఆయా పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టర్స్ కె.రాంబాబు, ఎస్‌ఐ జి.సురేంద్ర, అగ్నిమాపక అధికారి విజయ్, డివిజన్ పరిధిలోని సంక్షోభ నివారణ సిబ్బంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పెదపళ్ల సహకార సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారం దృశ్యం

సహకార పాలక వర్గాల ప్రమాణ స్వీకారం

ఆలమూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీలు మంగళవారం బాధ్యతలు స్వీకరించాయి. పెదపళ్ల పాలకవర్గం అధ్యక్షుడిగా జాస్తి భాస్కరరావు, సభ్యులుగా మోటిపల్లి శ్రీనివాసరావు, కత్తుల రాజశేఖర్, చొప్పెల్ల సహకార సంఘం అధ్యక్షుడిగా నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సభ్యులుగా నాగిరెడ్డి స్వామి, పంపన సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గాలకు కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, కూటమి నాయకులు గారపాటి త్రిమూర్తులు, సలాది నాగేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, వంటిపల్లి పాపారావు, మెర్ల గోపాలస్వామి తదితరులు అభినందించారు.

రైతులకు త్రిసభ్య కమిటీ ఉత్తమ సేవలందించాలి

రాయవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ త్రిసభ్య కమిటీ రైతులకు ఉత్తమ సేవలు అందించాలని లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు కోరారు. మంగళవారం వెదురుపాక శ్రీవారాహి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పిల్లి గణేష్, సభ్యులు నల్లమిల్లి రాజేష్‌రెడ్డి, తేగల గోపికి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రాంబాబు, టీడీపీ సీనియర్ నేత కొవ్వూరి చంటిరెడ్డి మాట్లాడారు. అనంతరం ఛైర్మన్ గణేష్, సభ్యులను కూటమి నాయకులు, రైతులు సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్డాది చిన్నకృష్ణంరాజు, సత్తి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, ఎంపీటీసీ ఉండవల్లి సుబ్బారాయుడు, ఎం.శ్రీదేవి, రాయుడు ప్రసాద్, కేతా సతీష్ కుమార్, కొవ్వూరి భాస్కరరెడ్డి, వెలగల వీర్రెడ్డి, దేవిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.



వెదురుపాకలో త్రిసభ్య కమిటీ ఛైర్మన్ గణేష్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు



మండపేట తాలుకా ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన ఉద్యోగులు

'ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేయాలి'

మండపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న పీఆర్‌సీ వేతన సంఘ కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీఎన్‌జీవో ఉద్యోగ సంఘ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే పీఆర్‌సీ నేడు ఆరేళ్లయినా నేటికీ వేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తక్షణమే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి: విజయవాడలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగే ఉద్యోగ సంఘాల సమావేశాన్ని విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు విల్సన్ కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని ఆయన అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: మండపేట తాలుకా నూతన కమిటీ వివరాలను నేతలు వెల్లడించారు. తాలుకా ఉద్యోగ సంఘ అధ్యక్షుడిగా ఎంవీవీఎస్ ప్రసాద్, కార్యదర్శిగా శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడుగా వి.సూర్యనారాయణ, కోశాధికారిగా టి.రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జ్యోతికుమార్ ఉపాధ్యక్షులుగా చిట్టితల్లి, పి.పద్మజ, సుధాకర్, శివప్రసాద్‌తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కోనసీమ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె.వీరబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను నేతలు అభినందించారు.

ఆసుపత్రి డ్రైనేజీ మెరుగునకు చర్యలు



ఆలమూరు సీహెచ్‌సీలో వార్డులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఆలమూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రైనేజీ సిస్టమ్ సక్రమంగా లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వక్తలన్నారు. తక్షణం డ్రైనేజీ సిస్టమ్‌ను మెరుగుపరచాలని ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో తీర్మానించారు. ఆసుపత్రి ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఎ.రాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ శివశంకర్, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ ఎస్.పట్టాభి, సభ్యులు చీపురుపల్లి గణేష్, గుత్తుల వెంకట లక్ష్మి, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, రామానుజుల శేషగిరిరావు, కేతా రాంబాబు, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి మోక్షాంజలితోపాటు పలువురు నాయకులు పలు అంశాలపై చర్చించారు. డ్రైనేజీ సిస్టమ్‌ను తక్షణం అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఆసుపత్రిలో వైద్యులు పూర్తిగా ఉన్నారని అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. పిల్లల వైద్యం కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి శివశంకర్‌ను పలువురు అభినందించారు.

పాఠశాలకు కంప్యూటర్లు అందించిన ఐడీబీఐ బ్యాంక్

మండపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం తాపేశ్వరంలో వున్న ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇంటియేట్‌లో బాగంగా తాపేశ్వరంలో వున్న జిల్లా పరిషత్ పీఎస్‌బి, జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రెండు కంప్యూటర్లతోపాటు రెండు బీరువాలను అందించారు. ఐడీబీఐ బ్యాంకు జీఎం కాన్వడేబ్ దాస్, ఏడీఎం నరేష్, తాపేశ్వరం బీఎం సాయి బాబాలు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి2 సోమిరెడ్డి, కోరా శివ, ఉపాధ్యాయులు వీవీ రమణ, శ్రీనివాస్‌శాస్త్రి, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



తాపేశ్వరం హైస్కూల్‌కు కంప్యూటర్లు బహూకరించిన బ్యాంక్ ఉద్యోగులు

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, జూలై 22(ఆంధ్రజ్యోతి): అంతర్వేది క్షేత్రంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను సింహాసనంపై ఆశీనులు చేసి అలంకరించారు. విశ్వక్సేనపూజ, పాణిగ్రహణం, మాంగళ్యధారణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు.

కూటమి పాలనపై ప్రజల సంతృప్తి

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు



రామచంద్రపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 22(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వ పాలనపట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం ఉండూరు, భీమక్రోసుపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి పర్యటన జరిపారు. ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజాభిప్రాయాలను టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, బీసీ సెల్ నాయకుడు పి.సాంబశివరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ సి.వీరభద్రరావు, పార్లమెంట్ కమిటీ కన్వీనర్ పలివెల ప్రకాష్, చిగురుపాటి సాయిరామ్, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వద్దిపర్రులో జుజ్జవరపు హరిబాబు, వాకలపూడి సూరిబాబుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలిపారు. పార్టీ యాప్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేశారు. ఆయా గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు కూనంపూడి రామకృష్ణంరాజు పర్యటించారు. వెలిచేరులో నాగిరెడ్డి సత్యనారాయణ, కవల సత్తిబాబు, మెర్లపాలెంలో మెర్ల లక్ష్మిపతి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం ఈతకోటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ఇంటింటికి పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమం లో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం మండలం ఈతకోటలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం ఆయన కూళ్ల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది పాలనలో అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో నిక్షిప్తం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిట్టూరి రామ్మోహన్‌రావు, పెంకే గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చింతలూరు కనకదుర్గమ్మ

శాకంబరిగా కనకదుర్గ అమ్మవారు

ఆలమూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): చింతలూరు మెయిన్‌రోడ్డులోనున్న కనకదుర్గ అమ్మవారు మంగళవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ముందుగా ఆలయ అర్చకులు పెద్దింటి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమీకృత వసతిగృహం పరిశీలన

ద్రాక్షారామ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో సమీకృత వసతిగృహాన్ని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు పరిశీలించారు. వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. వసతిగృహంలో చేపడుతున్న మరమ్మతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలి

ద్రాక్షారామ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కందులపాలెం, ఉండూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ బి.నాగకుమార్ పలు అంశాలపై మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి మణిదీప్ వ్యవసాయ రుణాలు తీసుకుంటున్న రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని కోరారు. కౌలు రైతులు కూడా పంటల బీమా చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కందులపాలెం పీఏసీసీఎస్ త్రీమెన్ కమిటీ ఛైర్మన్ వైట్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ అచ్యుతవేణి, వ్యవసాయ సహాయకుడు శ్రీరామ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

కపిలేశ్వరపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మంగళవారం అంగర శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వైసీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై ధ్వజమెత్తారు. కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో పాటు, 19 గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చేర్చుకోకపోవడం వల్ల తల్లికి వందనం రాలేదు

కపిలేశ్వరపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లపులంక గ్రామానికి చెందిన వందే లక్ష్మణరావు కుమారుడు సమీర్‌బాబును పాఠశాలలో చేర్చుకోకపోవడం వల్ల తల్లికి వందనం రాలేదని శ్రమ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ నాగేశ్వరి ఆరోపించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పల్లపులంక ప్రాథమిక పాఠశాలలో మాటలురాని (ఆటిజం) బాలుడిని 20 రోజులుగా పాఠశాలలో అడ్మిషన్ నిరాకరించినట్లు తెలిపారు. దీనిపై తండ్రి ఆవేదనను తెలుసుకున్న తమ సంస్థ గ్రామస్థులను, సీబీఓఎస్‌ని కలుపుకుని స్కూల్ టీచర్‌తో మాట్లాడి జాయిన్ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బాలుని తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, సీబీఓఎస్, సీఆర్పీ, పల్లపులంక గ్రామ ఆర్డినేటర్ నాగరాజు, శ్రమ టీం సభ్యులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వాడపల్లి ఆలయం

ఆత్రేయపురం, జూలై 22ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,53,416 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పొదలాడకు చెందిన పలపోతు నాగేశ్వరరావు, కళావతి దంపతులు రూ.25,016, కొమరాజులంకకు చెందిన కర్రి వెంకటరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటాలు అందచేశారు. మంగళవారం సాయంత్రం స్వామివారిని జీఆర్‌ఎంబీ మెంబర్ సెక్రటరీ ఆర్‌కే కనోడియా, జీడీఎస్ గోదావరి డేటా చీఫ్ ఇంజనీర్ కె.శేషుబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనం తీసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు: ప్రతి శనివారం వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఆలయంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. భక్తులు దర్శనం చేసుకుని బయటకు వెళ్లే మార్గంలో ఎక్స్‌లేటర్ యంత్రం ఏర్పాటును పరిశీలించారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భక్తులు నదిలో స్నానాలు చేసేటప్పుడు ప్రమాదాలు తలెత్తకుండా జల్లు స్నానం ఏర్పాటు చేశామన్నారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో చీఫ్ ఇంజనీర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

జశ్వంత్‌కు మంత్రి అభినందన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 22 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఇటీవల జరిగిన ఇండో-నేపాల్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన మేడిశెట్టి జశ్వంత్‌ను మంత్రి సుభాష్ అభినందించారు. ఈనెల 11 నుంచి 15 వరకు నేపాల్‌లో జరిగిన స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ మూడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో రామచంద్రపురానికి చెందిన జశ్వంత్ బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. బంగారు పతకం సాధించిన జశ్వంత్, కోచ్ నాగార్జునను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, కంచుమర్తి బాబూరావు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మకు సారె సమర్పించిన భక్తులు

ముత్యాలమ్మకు అషాడం సారె

కె.గంగవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మకు గ్రామస్తులు మంగళవారం ఆషాడం సారె సమర్పించారు. మహిళలు చీర, రవిక, గాజులు, పలు రకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



మాట్లాడుతున్న ఏడీఏ నాగకుమార్

ఖరీఫ్ పంటకు బీమా చేయించుకోండి

కె.గంగవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట సాగు చేసిన ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ రామచంద్రపురం ఏడీఏ బి. నాగకుమార్ అన్నారు. మంగళవారం శేరిలంక, గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏవో ఏ.సద్గురుమూర్తి మాట్లాడుతూ రైతులు తమ పంటను ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. గంగవరం సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్య నారాయణ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కాటన్ బ్యారేజీ, లొల్ల లాకుల పరిశీలన

ఆత్రేయపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ హయాంలో నిర్మించిన కాటన్ బ్యారేజీ, సెంట్రల్ డెల్టాకు సాగు నీరందించే లొల్ల లాకుల వ్యవస్థను మంగళవారం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ మెంబర్, సెక్రటరీ ఆర్‌కే కనోడియా పరిశీలించారు. తొలుత వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని లొల్ల లాకుల వద్దకు చేరుకున్నారు. సెంట్రల్ డెల్టా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శేషుబాబు లాకుల వ్యవస్థపై ఆయనకు తెలిపారు. సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల లాకుల ద్వారా ముక్తేశ్వరం, అమలాపురం, పి.గన్నవరం కాలువల ద్వారా కోనసీమ జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రస్తుతం లాకుల పరిస్థితిని వివరించారు. లొల్ల లాకుల ఆధునీకీకరణకు రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాటన్ బ్యారేజీని సందర్శించారు. మూడు డెల్టాల ద్వారా వెళుతున్న ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు విధానాన్ని ఆయన తెలిపారు. కాటన్ బ్యారేజీ, లొల్ల లాకుల వ్యవస్థను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళతానని కనోడియా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఇరిగేషన్ ఏఈ మాధవ్, సిబ్బంది సత్కరించారు. ఈయన వెంట ఇరిగేషన్ సెక్షన్ ఎస్ఈ కె.గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



లొల్ల లాకులను పరిశీలిస్తున్న ఆర్‌కే కనోడియా, చీఫ్ ఇంజనీర్లు

ముగిసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): టేకి గ్రామంలోనున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శ్రీపుష్పోత్సవంతో ముగిసాయి. సోమవారం రాత్రి దేవదాయ శాఖ అధ్వర్యంలో ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం తదితర పూజలను ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి శ్రీ పుష్పయాగం వేదమంత్రోశ్చరణ మధ్య జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



టేకిలో పుష్పోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

విద్యావేత్తలు రాజకీయాల్లోకి రావడం శుభపరిణామం

కె.గంగవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యావేత్తలు రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామం అని కార్మికశాఖ మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం కూళ్ల గ్రామంలో పర్యటించిన ఆయన ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన చిట్టూరి రామ్మోహన్‌రావు దంపతులను సన్మానించారు. అనంతరం అయన్ను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు, సొసైటీ ఛైర్మన్ పెంకే గోవిందరాజు, సలాది రమేష్, దామినేని శ్రీనివాసు, మరివాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు రామ్మోహన్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి సుభాష్

సుందర సందేశం పుస్తకావిష్కరణ

ఆలమూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం సంధిపూడిలో సుందర సందేశం పుస్తకావిష్కరణ జరిగింది. కవి అంగర గోపాలకృష్ణ(కృష్ణశ్రీ) రచించిన సుందర సందేశం పుస్తకాన్ని సంధిపూడి వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో రచిత అధ్వర్యంలో నాయకులు దొడ్డా సుబ్బారావు, సూరపురెడ్డి తాతానాయుడు, సూరపురెడ్డి గోపాలకృష్ణ తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుందర సందేశం పుస్తక ప్రత్యేకతను ఈ సందర్భంగా వివరించారు.



సంధిపూడిలో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం